ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు - గరిష్ఠం : 40.0 కనిష్ఠం : 25.0
ANDHRAJYOTHY
5

అనంతపురం
జిల్లా వార్తలు
గురువారం 20 మార్చి 2025

రారండోయ్.. భక్తులారా..!

నేడు ఖాద్రీశుడి బ్రహ్మ రథోత్సవం

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

భక్తులకు ఉచిత రవాణా, భోజనం, తాగునీరు

సేవకు సిద్ధమైన దాతలు

ఏడు వందల మందితో బందోబస్తు


శ్రీవారి బ్రహ్మరథం(ఫైల్)

కదిరి/అర్బన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఖాద్రీశుడి బ్రహ్మ రథోత్సవానికి భక్తులు సిద్ధమయ్యారు. పాల్గుణ మాసం, అనూరాధ నక్షత్రం, మేష లగ్న శుభపుష్కరాంశంలో, గురువారం ఉదయం 7.45 గంటల నుంచి 8.20 గంటల మధ్య రథాన్ని కదిలించేలా ఆలయ వేద పండితులు ముహూర్తం ఖరారు చేశారు. లక్ష్మీ నరసింహస్వామి రథాన్ని వేలాది మంది భక్తులు మోకులతో లాగుతారు. రథం సక్రమంగా కదిలేలా కుటాగుళ్ల, గజ్జలరెడ్డిపల్లి, మూర్తిపల్లి, గంగిరెడ్డిపల్లి గ్రామస్థులు మొద్దులు వేస్తారు. రథోత్సవానికి ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. రథాన్ని లాగడానికి మోకులు, మొద్దులు, తెడ్లను సిద్ధం చేశారు. వేర్వేరు ప్రాంతాల నుంచి కదిరికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. బందోబస్తు కోసం ఏడు వందల మంది పోలీసులను

(మిగతా 7లో)

నీటి కోసం పొలంబాట


వ్యవసాయ బోరుబావి వద్ద నీరు పట్టుకుంటున్న కత్తిమానుపల్లి వాసులు

యాడికి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): బోరుబావి మరమ్మతులకు గురికావడంతో గ్రామస్థులు నీటి కోసం పొలంబాట పట్టారు. యాడికి మండలం కత్తిమానుపల్లిలో వారంరోజులుగా నీటి కోసం ఇబ్బంది పడుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. బోరు బావి మరమ్మతులకు గురికావడంతో గ్రామ సమీపంలోని వ్యవసాయ బోరుబావుల వద్దకు వెళ్లి నీళ్ల తెచ్చుకోవాల్సి వస్తోందని అన్నారు. సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని వివరించారు. పంచాయతీ కార్యదర్శి అశ్వత్థమనాయుడును వివరణ కోరగా.. తక్షణమే బోరుబావికి మరమ్మతులు చేపడతామని, నీటి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

దొంగల్లారా.. దొరికిపోండి..!

నార్పలలో వరుస చోరీలు

పోలీసులకు బాధితుల ఫిర్యాదులు

- ఉన్నతాధికారులకు అర్జీలు
- ఒక్క కేసూ ఛేదించని దుస్థితి
- డబ్బు, నగలపై ఆశలు వదులుకుంటున్న బాధితులు

నార్పల, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో దొంగలు రెచ్చిపోతున్నారు. వరుసగా చోరీలు చేస్తున్నారు. దొరికినంతా డబ్బు, నగలు అపహరించుకెళ్తున్నారు. ఆరునెలల వ్యవధిలోనే పదికిపైగా చోరీలకు పాల్పడ్డారు. పోలీసుల దృష్టికి రానివి మరో పదికిపైగా ఉంటాయని సమాచారం. పోలీసులకు బాధితులు ఫిర్యాదులు చేస్తున్నారు. పట్టించుకోకపోవడంతో ఉన్నతాధికారులకు అర్జీలు సైతం ఇస్తున్నారు. ఏమాత్రం ప్రయోజనం లేదని బాధితులు వాపోతున్నారు. ఒక్కటంటే ఒక్క చోరీ కేసు కూడా ఛేదించలేదని విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నెలలు గడుస్తున్నా పోలీసులు పట్టించుకోకపోవడంతో చోరీ అయిన తమ డబ్బు, నగలపై బాధితులు ఆశలు వదులుకుంటున్నారు.

వరుస చోరీలు..

- నార్పలలోని ఉద్దిబావి చేను కాలనీలో నివాసముంటున్న పులసలనూతల సునీత ఇంట్లో ఆరు తులాల బంగారు నగలు ఎత్తుకెళ్లారు.
- దూల్పేట్ కాలనీకి చెందిన చాకలి నాగేశ్వరి ఇంట్లో రూ.లక్ష, ఒకటిన్నర తులం బంగారు నగలు
- దిగుమర్రి రోడ్డుకు చెందిన ఫాదర్ డేవిడ్ ఇంట్లో 9 తులాల బంగారు నగలు లక్ష్మీనగర్‌కు చెందిన వెంకటశేషప్ప ఇంట్లో 5 కేజీల వెండి, మూడు తులాల బంగారు నగలు
- నార్పల క్రాసింగ్‌లో ఉన్న హోటల్ రాజు ఇంట్లో తులం బంగారం, రూ.30వేలు నగదు
- వెంకటాంపల్లికి చెందిన శ్రీనివాసులు ఇంట్లో రూ.3లక్షలు
- పోలీసుల దృష్టికి రానివి చాలానే ఉన్నాయని తెలుస్తోంది. నార్పల క్రాసింగ్‌లో ఇటీవల వేణు అనే వ్యక్తి సిమెంటు దుకాణం తలుపులు బద్దలుకొట్టి, రూ.లక్ష విలువ చేసే 300 ప్యాకెట్లు అపహరించారు. దీనిపై కేసు నమోదు కాలేదు. ఇలా చెప్పుకుంటూ పోతే కేసు నమోదు కానివి పదుల సంఖ్యలో ఉన్నాయని తెలుస్తోంది.

జనం బెంబేలు..

నార్పలలో వరుస చోరీలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వ్యాపారాలతో నార్పలలో ఆర్థికంగా బాగా ఉన్నారు. దీంతో దొంగలు వరుస చోరీలకు పాల్పడుతున్నారు. చోరీ జరిగిన వెంటనే క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌తో పరిశీలిస్తున్నారు. కేసులో మాత్రం ఎలాంటి పురోగతి సాధించకపోవడం గమనార్హం. దొంగలను పట్టుకుని తమ డబ్బు, నగలు ఇప్పించాలని పోలీసు స్టేషన్ చుట్టూ బాధితులు తిరుగుతున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు చొరవ చూపి, దొంగలను పట్టుకుని తమ డబ్బు, నగలు రికవరీ చేయాలనీ, మండలంలో చోరీలు జరగకుండా అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



డబ్బు, నగలపై ఆశలు వదులుకున్నా



నా భర్త చనిపోయిన రెండు రోజుల తరువాత గుడి వద్దకు నిద్ర చేయడానికి పిల్లలతో సహా గూగూడు వెళ్లా. ఆ సమయంలో ఇంట్లో ఉన్న రూ.లక్ష, ఒకటిన్నర తులం బంగారు నగలు చోరీ చేశారు. దొంగలు పడి నాలుగు నెలలవుతోంది. పోలీసులు నేటికీ పట్టించుకోలేదు. నా డబ్బు, నగలపై ఆశ వదులుకున్నా.

- చాకలి నాగేశ్వరి, నార్పల

నాలుగు సార్లు ఎస్పీకి ఫిర్యాదు చేశా



కుటుంబ సభ్యులంతా బయటకు వెళ్లినపుడు చోరీ చేశారు. ఏడు నెలలవుతోంది. అనుమానితుల పేర్లు కూడా చెప్పా. కనీసం వారిని పిలిపించి, విచారించలేదు. పోలీసులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. డబ్బు, నగదు రికవరీ చేయించాలని ఎస్పీకి నాలుగు సార్లు ఫిర్యాదు చేశా.

- పులుసులనూతల సునీత, నార్పల

త్వరలోనే దొంగలను పట్టుకుంటాం



చోరీలపై విచారణ చేస్తున్నాం. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. ఇప్పటికే కొందరు అనుమానితులను గుర్తించాం. త్వరలోనే దొంగలను పట్టుకుంటాం. చోరీల నివారణపై ప్రత్యేక దృష్టి పెడతాం.

- సాగర్, ఎస్ఐ, నార్పల

డిగ్రీ విద్యార్థుల గ్యాంగ్ వార్

హాస్టల్లోకి వెళ్లి స్థానికేతరులపై దాడి

ఆరుగురిని అరెస్టు చేసిన పోలీసులు

అనంతపురం క్రైం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాల విద్యార్థులు లోకల్.. నాన్‌లోకల్‌గా విడిపోయి గొడవపడ్డారు. ఈ వ్యహారంలో టూటౌన్ పోలీసులు ఆరుగురిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న ప్రవీణ్‌కుమార్ నాయక్, మధుసూదన్ నగరంలోని శ్రీవినాయక హాస్టల్‌లో ఉంటున్నారు. వీరితో డిగ్రీ రెండో సంవత్సరం విద్యార్థులు గణేష్, రామ్‌చరణ్, జగదీష్, అనిల్ సాగర్ తదితరులతో లోకల్, నాన్ లోకల్ వివాదం తలెత్తింది. ఈ నెలలో జరిగిన వినయ్ అనే విద్యార్థి బర్త్‌డే పార్టీలో జరిగిన గొడవను మనసులో పెట్టుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం శ్రీవినాయక హాస్టల్‌లోకి గణేష్, రామ్‌చరణ్, చందు, అనిల్‌సాగర్, దామోదర్, కుమార్, జగదీష్ అక్రమంగా ప్రవేశించారు. మధుసూదన్, ప్రవీణ్‌నాయక్‌ను కట్టెలతో కొట్టుకుంటూ కిందకు తీసుకొచ్చారు. అనంతరం బైకులలో ఎక్కించుకుని ఆలమూరు చెరువు చెక్ డ్యాం వద్దకు తీసుకెళ్లి మరోసారి దాడి చేశారు. ఈ ఘటనపై మధుసూదన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులలో ఆరుగురిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కుమార్ అనే నిందితుడు పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. గ్యాంగ్‌లుగా ఏర్పడి గొడవపడితే కఠిన చర్యలు తప్పవని సీఐ శ్రీకాంత్ హెచ్చరించారు.

పది పరీక్షలకు 517 మంది గైర్హాజరు


పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం విద్య, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు బుధవారం రెగ్యులర్, ప్రైవేట్, ఓపెన్ విద్యార్థులు 517 మంది గైర్హాజర య్యారు. రెగ్యులర్ విద్యార్థులు 30862 మందికిగాను 30,537 మంది హాజరు కాగా 325 మంది గైర్హాజరయ్యారు. ప్రైవేట్ విద్యార్థులు 32 మందికిగాను 15 మంది హాజరు కాగా 17 మంది గైర్హాజరయ్యారు. ఓపెన్ విద్యార్థులు 1034 మందికిగాను 859 మంది హాజరు కాగా 175 మంది గైర్హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ రాంనగర్‌లోని కమ్మభవన్ వద్ద ఉన్న శ్రీచైతన్య స్కూల్‌లోని ఏ , బీ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షలు సజావుగా సాగుతున్నాయని పేర్కొన్నారు. డీఆర్వో మలోల, డీఈఓ ప్రసాద్‌బాబు మరికొందరు అధికారులు అరవింద్‌నగర్‌లోని శ్రీకృష్ణదేవరాయ స్కూల్‌లోని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. జిల్లా అబ్జర్వర్ 7 కేంద్రాలను, డీఈఓ ఒక కేంద్రాన్ని ఫ్లైయింగ్ స్క్వాడ్ 50 కేంద్రాలను, సిట్టింగ్ స్క్వాడ్ 30 కేంద్రాలను తనిఖీ చేశారు.

అవినీతి పోలీసులపై విచారణ

నాలుగు జిల్లాల ఎస్పీలతో డీఐజీ టెలీ కాన్ఫరెన్స్

హెడ్‌క్వార్టర్స్‌కు రమ్మని ఆ సీఐకి పిలుపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం క్రైం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అవినీతికి పాల్పడుతున్న పోలీస్ అధికారులపై విచారణ ప్రారంభమైంది. జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు రెండు కీలక విభాగాలు వారిపై దృష్టి సారించాయి. 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన సింహం గడ్డి మేస్తే కథనానికి జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించారు. అనంతపురం రేంజ్ డీఐజీ తన పరిధిలోని నాలుగు జిల్లాల ఎస్పీలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా జిల్లాల పరిధిలో వసూళ్ల వ్యవహారం నడుపుతున్న పోలీస్ అధికారులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు సమాచారం. పోలీస్‌స్టేషన్‌లో అవినీతికి అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించే అధికారులపై చర్యలు తప్పవని స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈక్రమంలో జిల్లా ఎస్పీ జగదీష్ స్పెషల్ బ్రాంచ్, లా అండ్ ఆర్డర్ విభాగాల అధికారులతో ఆరా తీశారు. జిల్లాలో ప్రతి పోలీస్‌స్టేషన్‌పైనా ఆరా తీయాలని ఆదేశించినట్లు తెలిసింది. పైసా వసూళ్లకు పాల్పడుతున్న వారెక్కడున్నా నివేదిక ఇవ్వాలని సూచించినట్లు సమాచారం. కేసులు కట్టడంలో నిర్లక్ష్యం వహిస్తూ, వసూళ్లలో పేరు గాంచిన ఓ సీఐను జిల్లా హెడ్‌క్వార్టర్స్‌కు రమ్మని పిలిపించారు. ఆయనతో పాటు ముడుపుల బాగోతంలో టాప్‌లో ఉన్న ఇద్దరు లేదా ముగ్గురిపై వేటుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

పండగ చేస్కోండి..!

స్కూళ్లలో భాషా పండుగల కోసం నిధుల విడుదల

అనంతపురం విద్య, మార్చి 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు పాఠశాలల్లో భాషా పండుగలు, సైన్స్, మ్యాథ్స్ క్లబ్స్ నిర్వహణకు నిధులు విడుదల చేసినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, ఏపీసీ శైలజ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 364 సెకెండరీ, సీనియర్ సెకెండరీ స్కూళ్లలో భాషా పండుగలు (లాంగ్వేజ్ ఫెస్టివల్స్), 198 సెకెండరీ, 325 ప్రైమరీ పాఠశాలల్లో సైన్స్, మ్యాథ్స్ క్లబ్‌లు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. దీనికి సంబంధించి ఎంఈఓలకు నిధులు విడుదల చేశామన్నారు. భాషా పండుగల కోసం ఒక్కో పాఠశాలకు రూ.500 చొప్పున రూ. 1,82,000, సైన్స్, మ్యాథ్స్ క్లబ్స్ కోసం ఒక్కో స్కూల్‌కు రూ. 1000 చొప్పున రూ.3.25లక్షలు విడుదల చేశామన్నారు. స్కూళ్ల వివరాలు, విడుదల చేయాల్సిన మొత్తానికి సంబంధించి వివరాలను ఎంఈఓకు ఇచ్చామని, ఆ మేరకు నిధులు విడుదల చేయాలన్నారు. నిధులు మంజూరైన స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు స్కూళ్లలో భాషా పండుగలు, సైన్స్, మ్యాథ్స్ క్లబ్స్ నిర్వహించాలని సూచించారు.

రెవెన్యూ సమస్యలపై దృష్టి పెట్టండి

అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

అనంతపురం టౌన్, మార్చి19 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రతి అధికారి ప్రత్యేక దృష్టిపెట్టి, పరిష్కరించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. జేసీ శివనారాయణ శర్మతో కలిసి ఆయన బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రెవెన్యూ సమస్యలపై ఎప్పటికపుడు విశ్లేషించుకొని పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈనెల25, 26 తేదీల్లో ముఖ్యమంత్రి కలెక్టర్ల సదస్సు ఉంటుందనీ, ప్రభుత్వ పథకాలకు సంబంధించి పక్కా సమాచారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో మలోల, ఆర్డీఓలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కన్నీటి పంట..!

అప్పులు తెచ్చి, లక్షల రూపాయల పెట్టుబడులు పెట్టి సాగుచేసిన ఉద్యాన పంటలు అన్నదాతకు కన్నీళ్లు మిగిల్చాయి. వైరస్‌ల దెబ్బకు నిలువునా ఎండిపోతున్నాయి. పంటలను తోటల్లోనే వదిలేస్తున్నారు. పెట్టుబడులు, ఆరుగాలం కష్టం వృథా అవుతున్నాయి. లక్షల రూపాయల నష్టాలు మూటగట్టుకుంటున్నారు రైతులు. వైరస్‌ల దెబ్బకు ఉద్యాన పంటలైన కలింగర, కర్బూజా, ఢిల్లీ దోస దారుణంగా దెబ్బతిన్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. -ఆంధ్రజ్యోతి, చెన్నేకొత్తపల్లి

- ఉద్యాన పంటలపై వైరస్ పంజా
- దెబ్బతిన్న కలింగర, కర్బూజా, ఢిల్లీదోస పంటలు
- వేలాది ఎకరాల్లో నష్టం
- తోటల్లోనే వదిలేస్తున్న రైతులు

విస్తారంగా సాగు

వేరుశనగ సాగు చేసి ఏటా నష్టాలు వస్తుండటంతో ఉద్యాన పంటల వైపు జిల్లా రైతులు మొగ్గు చూపుతున్నారు. కలింగర, కర్బూజా, ఢిల్లీదోస పంటలను వేల ఎకరాల్లో సాగు చేశారు. చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి, ముదిగుబ్బ, బత్తలపల్లి, తాడిమర్రి తదితర మండలాల్లో వందల ఎకరాల్లో పంటలు పెట్టారు.

చుట్టుముట్టిన వైరస్‌లు

పంటలు కీలక దశలో వైరస్‌లు చుట్టుముట్టాయి. రసం పీల్చే పురుగు పంటలను విపరీతంగా ఆశించింది. తెల్లదోమ, తామర పురుగుతోపాటు నల్లి, క్రిప్స్ అనే వైరస్‌లు మూడు పంటలపై అధికంగా వ్యాపిస్తున్నాయని అధికారులు అంటున్నారు. రసం పీల్చే పురుగు పంటను ఆశిస్తోంది. ఆకులు, కాయల్లోని రసాన్ని పీల్చేస్తోంది. దీంతో తోటలు నిలువునా ఎండిపోతున్నాయి. కాయలు ఎందుకూ పనికి రాకుండాపోతున్నాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా తిప్పలు పడుతున్నారు. ఏ మందులు వాడాలో సలహాలివ్వాల్సిన ఉద్యాన శాఖాధికారులు తోటల వద్దకు కూడా రావట్లేదని అన్నదాతలు వాపోతున్నారు. దీంతో ఎరువుల దుకాణాల వద్దకెళ్లి వారు ఇచ్చిన రసాయన మందులు తీసుకొచ్చి, పంటలకు పిచికారీ చేస్తున్నారు. ఇందుకోసం వేల రూపాయలు వెచ్చిస్తున్నారు. అయినా ఫలితం దక్కట్లేదు. పంటలు ఎండిపోతున్నాయి. ఇలా.. రైతులపై మందులపై అదనపు భారం పడుతోంది.


వైరస్‌తో దెబ్బతిన్న కలింగర పంట


చెన్నేకొత్తపల్లిలో దోస పంటను వదిలేసిన దృశ్యం



నివారణ చర్యలు

పంటలకు వైరస్ సోకకుండా రైతులు తగిన నివారణ చర్యలు చేపట్టాలంటున్నారు ఉద్యాన శాఖాధికారులు. రసం పీల్చే పురుగును అరికట్టడానికి జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పంట చుట్టూ మూడు, నాలుగు వరుసలు జొన్నగానీ, మొక్కజొన్నగానీ వేసుకోవాలని సూచిస్తున్నారు. ఫిప్రోనిల్, అసిఫేట్ తదితర మందులను పిచికారీ చేసుకోవాలని చెబుతున్నారు.

పంట పూర్తిగా దెబ్బతింది



ఐదెకరాల్లో కలింగర సాగు చేశా. రూ.3లక్షల వరకు పెట్టుబడి పెట్టా. ఎప్పటికప్పుడు మందులు పిచికారీ చేశా. అయినా వైరస్ అదుపులోకి రాలేదు. పంట మొత్తం తుడిచిపెట్టుకుపోయింది.

- ఓబిరెడ్డి, కలింగర రైతు, చెన్నేకొత్తపల్లి

రూ.4లక్షల దాకా నష్టం



ఎనిమిది ఎకరాల్లో దోస సాగుచేశా. రూ.9 లక్షలదాకా పెట్టుబడి వచ్చింది. ఆశించిన మేర దిగుబడి రాలేదు. దీంతో రూ.4 లక్షల వరకు నష్టం వచ్చింది. పంటను కాపాడుకునేందుకు ఎంత కష్టపడినా ఫలితం లేదు.

- నరేశ్, దోస రైతు, ముదిగుబ్బ

మూడున్నర ఎకరాల్లో కలింగర సాగుచేశా



మూడున్నర ఎకరాలో కలింగర సాగు చేశా. రూ.3.50లక్షలు పెట్టుబడి వచ్చింది. అప్పు చేసి పంట పెడితే రూ.2.50లక్షలు నష్టం వచ్చింది.

- నాగరాజు, రైతు, కనగానపల్లి

వేసవిలో వైరస్ సోకే అవకాశాలు ఎక్కువ

వేసవిలో కలింగర, దోస, ఢిల్లీదోస తదితర పంటలకు వైరస్ సోకే అవకాశాలు ఎక్కువ. అననుకూల సీజన్ కావడమే ఇందుకు కారణం. అధిక మొతాదులో మందులు వాడినా ప్రయోజనం ఉండదు. పంటలో సస్యరక్షణ పద్ధతులు పాటించాలి.

- చంద్రశేఖర్, జిల్లా ఉద్యాన శాఖాధికారి

మా వినతులపై చిన్న చూపు ఎందుకు ?

అసెంబ్లీలో వైద్య ఆరోగ్యశాఖను నిలదీసిన ప్రభుత్వ విప్ కాలవ



రాయదుర్గం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): వెనుకబడ్డ ప్రాంతాల సమస్యలపై ప్రజాప్రతినిధులు ఇచ్చే వినతులపై చిన్నచూపు సరికాదని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖకు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు హితవు పలికారు. అసెంబ్లీలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. రాయదుర్గం ప్రభుత్వ వైద్యశాలలో వైద్యసేవలు, మౌలిక వసతుల కల్పనపై సంబంధిత యంత్రాంగానికి ఎన్నిసార్లు విన్నవించినా స్పందన లేదని ఆరోపించారు. పట్టణంలో పెద్ద ఆసుపత్రి ఉన్నా వైద్యసేవల కోసం పొరుగున ఉన్న బళ్లారికి వెళ్లాల్సి రావడం ఎంతో అవమానంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. 2018లోనే ఆస్పత్రి స్థాయిని వంద పడకలకు పెంచుతూ ఆదేశాలు జారీ చేశారన్నారు. కొత్త భవనాలు, మౌలిక వసతుల కల్పన జరిగినా వైద్యుల పోస్టుల భర్తీలో నేటికీ జాప్యం కొనసాగుతోందన్నారు. 22 వైద్యుల పోస్టులు మంజూరైనా 14 పోస్టులు నేటికీ భర్తీ చేయలేదన్నారు. 8 మందిలో ఇద్దరు అనధికార సెలవుపై వెళ్లగా ఒకరు సస్పెండ్ అయ్యారని, మరొకరు దీర్ఘకాల సెలవులో ఉన్నారన్నారు. కేవలం నలుగురు మాత్రమే ప్రస్తుతం రాత్రి విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఆసుపత్రి భవనాల నిర్మాణ పనులు 95 శాతం పూర్తి అయ్యాయని పెయింటింగ్, ఫర్నిచర్ ఏర్పాటు చేస్తే త్వరగా ప్రారంభించవచ్చన్నారు. వైద్యపోస్టుల భర్తీ కోరుతూ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, సంబంధిత ప్రిన్సిపాల్ సెక్రటరీకి వినతులు సమర్పించినా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.

లిక్కర్ స్టోర్‌కు దరఖాస్తు చేసుకోండి

26వ తేదీ వరకు అవకాశం

ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి

అనంతపురం అర్బన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా కేంద్రంలో ప్రీమియం లిక్కర్ స్టోర్ నిర్వహణ కోసం ఎక్సైజ్ యంత్రాంగం మళ్లీ దరఖాస్తులు ఆహ్వానించింది. తొలుత గత ఏడాది డిసెంబరు 17వతేదీ నుంచి ఆ నెలాఖరు దాకా ప్రీమియం లిక్కర్ స్టోర్‌కు దరఖాస్తు కోసం గడువు విధించారు. అప్పట్లో ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడంతో ఈ ఏడాది జనవరి 7 దాకా రెండోసారి గడువు పొడిగించారు. అయినా స్పందన లేకపోవడంతో జనవరి 18దాకా మూడోసారి గడువు పొడిగించినా ఒక్క దరఖాస్తు దాఖలు కాలేదు. ఈ నేపథ్యంలో ప్రీమియం లిక్కర్ స్టోర్ ఏర్పాటు కోసం తిరిగి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. బుధవారం నుంచి ఈనెల 26వతేదీ దాకా దరఖాస్తు చేసుకునేందుకు గడువు విధించారు. 5 సంవత్సరాల కాల వ్యవధితో ప్రీమియం లిక్కర్ స్టోర్‌ను మంజూరు చేస్తామని అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. తొలి ఏడాదిలో లైసెన్స్‌దారులు రూ.కోటి వార్షిక పన్ను చెల్లించాలన్నారు. రెండో సంవత్సరం 10 శాతం పెంచుతామని అన్నారు. 4000 చదరపు అడుగులు బిల్డింగ్ ప్లాన్, మూడు సంవత్సరాల ఐటీ రిటర్న్స్, ఆధార్ కార్డు, పాన్ కార్డులను దరఖాస్తుకు జత చేసి సమర్పించాలన్నారు. ప్రీమియం స్టోర్ ఏర్పాటుకు దరఖాస్తును absbcl.gov.inలో దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు ఫీజు రూ.15లక్షలు నాన్ రిఫండబుల్ డబ్బులు డీడీ ద్వారా చెల్లించాలన్నారు. ఈనెల 26వతేదీ సాయంత్రం 5 గంటల్లోగా అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో దరఖాస్తులను ఆఫ్‌లైన్ పద్ధతిలో నేరుగా సమర్పించాలని సూచించారు. దాఖలైన దరఖాస్తులను రాష్ట్ర కమిషనర్‌కు పంపుతామని, రాష్ట్ర ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు ప్రక్రియ కొనసాగిస్తామని అన్నారు.

27న ఎంపీపీ ఖాళీ స్థానాలకు ఎన్నికలు

ఉమ్మడి జిల్లాలో 5 ఎంపీపీ, 4 వైస్ ఎంపీపీ ఖాళీలు

అనంతపురం విద్య, మార్చి19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న పలు పదవులకు ఈ నెల 27న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని నోటిఫికేషన్ జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో పలు కారణాల వల్ల ఖాళీ పడిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో 5 ఎంపీపీ, 4 వైస్ ఎంపీపీ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. అనంతపురం జిల్లాలో కణేకల్లు, కంబదూరు ఎంపీపీ, ఉరవకొండ-2, యల్లనూరు, పెద్దపప్పూరు, రాయదుర్గం వైస్ ఎంపీపీ స్థానాలు ఖాళీ పడ్డాయి శ్రీసత్యసాయి జిల్లాలో గాండ్లపెంట, రొద్దం, రామగిరి ఎంపీపీ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఒక్క రోజులోనే నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, విత్‌డ్రా, ఫలితాలు, ఎన్నికైన వారి ప్రమాణ స్వీకరణ ఉంటుంది.

రెండు ఉప సర్పంచ్ స్థానాలకు..

అనంతపురం న్యూటౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖాళీగా ఉన్న రెండు ఉప సర్పంచ్ స్థానాలకు ఎన్నిక నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని నోటిఫికేషన్ జారీ చేశారు. పామిడి మండలం రామగిరి, వజ్రకరూరు మండలం కొనకొండ్ల పంచాయతీలకు సంబంధించి ఉప ఎన్నిక నిర్వహించనున్నారు.

రైల్వే డివిజన్‌లో జీఎం తనిఖీలు



ఆదోని రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న అరుణ్ కుమార్ జైన్

గుంతకల్లు, మార్చి 19(ఆంధ్ర జ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ గుంతకల్లు రైల్వే డివిజన్‌లో తనిఖీలు నిర్వహించారు. బుధవారం ఉదయం డివిజన్‌లోని నాల్వార్ నుంచి గుంతకల్లు వరకూ రైలు ట్రాక్‌ను జీఎం తన ప్రత్యేక రైలులో రీర్ విండో తనిఖీ నిర్వహించారు. నాల్వార్-గుంతకల్లు సెక్షన్‌లో ఉన్న యాద్గిర్, కృష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్డు రైల్వే స్టేషన్లలో తనిఖీలను చేపట్టారు. రాయచూరులోని క్రూ కంట్రోల్ లాబీని పరిశీలించారు. ఆదోని స్టేషన్‌లో అమృత్ భారత్ స్టేషన్ కింద జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆదోని, మంత్రాలయం రోడ్ స్టేషన్లకు సమీపంలో తుంగభద్ర నదిపై నిర్మించిన వంతెనలను తనిఖీ చేశారు. సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో గుంతకల్లు రైల్వే స్టేషన్‌కు వచ్చారు. గుంతకల్లు స్టేషన్‌లో తనిఖీలు చేయకుండానే జోనల్ హెడ్‌క్వార్టర్స్ సికింద్రాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. జీఎం వెంట గుంతకల్లు డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, ఏడీఆర్ఎం సుధాకర్, వివిధ శాఖల ఇన్‌చార్జిలు, సబార్డినేట్ అధికారులు పాల్గొన్నారు.

గజవాహనంపై నారసింహుడు



గజవాహనంపై దర్శనమిస్తున్న శ్రీవారు

కదిరి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఖాద్రీ లక్ష్మీ నరసింహుడు బుధవారం గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యపూజ, హోమం అనంతరం గ్రామోత్సవాన్ని నిర్వహించారు. సంధ్యాసమయంలో శ్రీవారు గజ వాహనంపై ఊరేగారు. శ్రీమహావిష్ణు దశావతారాల్లో ఒక్కటైన నారసింహుడికి దేవేంద్రుడు తన వాహనమైన ఐరావతాన్ని పంపుతారని భక్తుల నమ్మకం. తెల్లవారితే బ్రహ్మరథోత్సవం ఉండటంతో ఆలయ ప్రాంగణంతో పాటు తిరువీధులన్నీ భక్తులతో కిక్కిరిసి పోయారు. భక్తుల కోసం ఆలయంతో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థలు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాయి. భక్తులకు వినోదం అందించడానికి ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఉత్సవం ముందు భాగంలో జానపద కళాకారులు ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

రారండోయ్.. భక్తులారా..!

నేడు ఖాద్రీశుడి బ్రహ్మ రథోత్సవం

(5వ పేజీ తరువాయి..)

రప్పించారు. భక్తుల ఆకలి తీర్చేందుకు దాతలు ఏర్పాట్లు చేసుకున్నారు. తాగునీరు, బయో టాయిలెట్లు ఏర్పాటు చేశారు.

పటిష్ట భద్రత

బ్రహ్మ రథోత్సవానికి ఎస్పీ రత్న పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారని డీఎస్పీ శివనారాయణ స్వామి తెలిపారు. ఆరుగురు డీఎస్పీలు, 20 మంది సీఐలు, 40మంది ఎస్ఐలు, ఐదు వందల మంది సివిల్ పోలీసులు, వంద మంది స్పెషల్ పార్టీ, ఎఆర్ పోలీసులు, 90 మంది ఏపీఎస్పీ పోలీసులు విధుల్లో పాల్గొంటున్నారు. ఇతర జిల్లాల నుంచి 60 మంది ప్రత్యేక క్రైమ్ పార్టీ పోలీసులను రప్పించారు. నిఘా కోసం పది డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నారు. సిబ్బందిలో వంద మంది మహిళా పోలీసులు ఉన్నారు. వాహనాలు తిరువీధుల్లోకి రాకుండా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.



ఆలయం ఎదుట కిక్కిరిసిన భక్తులు

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

బ్రహ్మరథోత్సవం నేపథ్యంలో కదిరికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. కదిరి డిపోలో ఉన్న 150 బస్సులను భక్తుల రాకపోకలకు వినియోగిస్తారు. కదిరి నుంచి గోరంట్ల మీదుగా హిందూపురం, నల్లమాడ, మదనపల్లి, బెంగళూరు, పులివెందల, తలుపుల మీదుగా ప్రత్యేక బస్సులు నడుస్తాయి. పట్టణంలో జీవిమాను సర్కిల్, వేమారెడ్డి సర్కిల్, హిందూపురం రోడ్డులోని వ్యవసాయ పరిశోధన కేంద్రం ఎదురుగా బస్సు షెల్టర్లను ఏర్పాటు చేశారు.

అన్నదాన కేంద్రాలు

ఆలయంలో ఎనిమిది వేల మందికి నిత్యాన్నదానం చేస్తున్నారు. దీంతోపాటు రథోత్సవానికి వచ్చే భక్తుల కోసం వేమారెడ్డి సర్కిల్, బస్టాండు, పశువైద్య కేంద్రం, టీటీడీ కళ్యాణ మండపం, హిందూపురం రోడ్డు, ఎమ్మెల్యే కందికుంట ఇంటి ఎదురుగా దాతలు అన్నదానం చేస్తున్నారు. నీరు, మజ్జిగ అందిస్తారు. బ్రహ్మరథోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశామని, భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవాలని ఎమ్మెల్యే కందికుంట కోరారు.

తెడ్లకు పూజలు

తేరు గమనాన్ని నియంత్రించడానికి వాడే తెడ్లకు ఆనవాయితీగా కుటాగుళ్ల కరణం వారసులు రాయసం హరిప్రసాద్ ఇంటివద్ద బుధవారం ప్రత్యే పూజలు నిర్వహించారు. అనంతరం తేరువద్దకు తరలించారు. కార్యక్రమంలో కరణం కుటుంబ సభ్యులు, పురోహితులు నాగభూషణ శాస్త్రి, సునిల్ శాస్త్రి, తెడ్లు తయారు చేసినశంకర్, నీరుగుట్టు చెన్నప్ప, నరేష్, రమేష్, పల్లోల గంగన్న, శ్రీరాములు, కుళ్లాయప్ప, ఉత్తప్ప తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు సిద్ధం..

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చొరవతో భక్తులు తిరువీధుల్లోకి రావడానికి ఉచిత రవాణా ఏర్పాటు చేశాం. వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి కోనేరు వరకు భక్తులు వచ్చేందుకు మినీ బస్సులు, ఆటోలు ఏర్పాటు చేశాం. తిరువీధుల్లో తాగునీటిని అందుబాటులో ఉంచాము. తాత్కాలిక బయో టాయిలెట్లు ఏర్పాటు చేశాము. వీటి ఖర్చును ఎమ్మెల్యే భరిస్తున్నారు.

-శ్రీనివాసరెడ్డి, ఈఓ

అలరిస్తున్న సాంస్కృతిక ప్రదర్శనలు

బ్రహ్మోత్సవాలలో కళాకారుల ప్రదర్శనలు భక్తులను అలరిస్తున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులు, మహిళలు కోలాటం, కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు ఇస్తున్నారు. ఆలయ ఆవరణలో గోవింద నామస్మరణ మార్మోగుతోంది. అనంతపురానికి చెందిన ఓం సంగీత, కోలాట శిక్షణ సంస్థ నిర్వాహకురాలు డాక్టర్ దేవరకొండ కౌసల్య బృందం ప్రదర్శించిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది.



కోలాటం వేస్తున్న కళాకారులు

ఈ తరానికి గుర్తు చేసేందుకే..



ఎన్నో కళలు కనుమరుగవుతున్నాయి. మన సంస్కృతి, సంప్రదాయాలలో కళలు ఒక భాగం. వాటిని ఈ తరానికి పరిచయం చేసేందుకు పదేళ్లుగా కోలాటంలో శిక్షణ ఇస్తున్నాను. స్వామి వేడుకలలో మా బృందం ప్రదర్శన ఇస్తోంది.

-డాక్టర్ కౌసల్య, కోలాట శిక్షకురాలు

ఆధ్యాత్మిక చైతన్యం



మా బృందం కోలాట ప్రదర్శనను ఖాద్రీశుడి భక్తులు తన్మయత్వంతో చూస్తున్నారు. మాలో మరింత ఉత్సాహాన్ని నింపుతున్నారు. ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యం కలిగించేందుకు మా వంతు ప్రయత్నం చేస్తున్నాం. కుటుంబ ఆలనాపాలనలో నిత్యం తలమునకలయ్యే మాకు కోలాటం ద్వారా ఎంతో ఆనందం కలుగుతోంది.

- రమాదేవి

ఆనందంగా ఉంది..



ఇంటి పనులు ముగించుకుని, సాయంత్రం పూట వెళ్లి కోలాటం నేర్చుకున్నాను. మా కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో స్వామివారి ఉత్సవాలలో ప్రదర్శన ఇస్తున్నాను. చాలా ఆనందంగా ఉంది.

-రాగిణి

మా అదృష్టం



స్వామి సన్నిధిలో కోలాట ప్రదర్శన అదృష్టంగా భావిస్తున్నాం. కోలాటం వల్ల మానసిక ఉల్లాసం కలుగుతోంది. 60 ఏళ్లు వచ్చినా ఆరోగ్యంగా ఉన్నాం. యువత తమ అభిరుచి మేరకు ఏదో ఒక కళలో రాణించాలి. మన సంప్రదాయాలను కొనసాగించాలి.

-పద్మలత

కళలు అవసరం..



మన సంస్కృతి సంప్రదాలు ప్రతిబింబించేలా ఏదో ఒక కళ నేర్చుకోవాలి. మహిళలు నిత్యం పనులతో ఒత్తిడికి లోనవుతుంటారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతో సాంత్వన కలుగుతుంది. ఇటీవల ప్రజల్లో మార్పు కనిపిస్తోంది. చిన్నతనం నుంచి తమ పిల్లలకు కళలలో శిక్షణ ఇప్పించి ప్రోత్సహిస్తున్నారు. ఇది శుభపరిణామం.


-విజయలక్ష్మి

అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా అనంత..!

నేడు ఆధ్యాత్మిక మందిరాల రూపకర్త ప్రసాద్ రాక

కోటి లింగాల భారీ శివలింగం ఏర్పాటుపై చర్చ

అనంతపురం కల్చరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అనంతపురం జిల్లా గుర్తింపు పొందే దిశగా అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగానే ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా కోటి లింగాలతో 300 అడుగుల ఎత్తయిన శివలింగాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ క్రమంలో స్థల పరిశీలన, ఆధ్యాత్మిక సంఘాల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించేందుకు ప్రఖ్యాత ఆధ్యాత్మిక మందిరాల రూపకర్త డీఎస్‌వీ ప్రసాద్ స్థపతి శుక్రవారం అనంతపురం విచ్చేయనున్నారు. శంషాబాద్‌లో 216 అడుగుల రామానుజాచార్యుల విగ్రహం, ఓంకారేశ్వర్‌లో 108 అడుగుల శంకరాచార్యుల మూర్తి, తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన స్వర్ణగిరి మందిరాలను దేశం గర్వించే స్థాయిలో డీఎస్‌వీ ప్రసాద్ రూపొందించారు. ఆయనతోపాటు మరో మందిర నిర్మాణ రూపకర్త శ్రీనివాస్ అనంతపురం రానున్నారు. కాగా నార్పల క్రాస్ వద్ద స్థలాన్ని దాదాపుగా ఖరారు చేశారు. దీనిపై తుదినిర్ణయాన్ని డీఎస్‌వీ ప్రసాద్ స్థపతి శుక్రవారం వెల్లడించనున్నారు. ఆ స్థలంలో కోటిలింగాలను ఒకే శివలింగంగా తీర్చిదిద్దడం ద్వారా 300 అడుగుల పంచముఖ శివలింగం, 108 అడుగులతో విష్ణుమూర్తి విగ్రహాన్ని ఏర్పాటు చేసి హరిహర దేవాలయం నిర్మించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఐదేళ్ల కిందటే నార్పల క్రాస్ వద్ద స్థల పరిశీలన చేసిన డీఎస్‌వీ ప్రసాద్ స్థపతి మందిర ప్రాజెక్టును ప్రారంభించేందుకు శుక్రవారం మరోసారి స్థలాన్ని పరిశీలించేందుకు వస్తున్నారు. అదేరోజు ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు జడ్పీ ఎదురుగా ఉన్న గీతా మందిరం వద్ద సాయికృష్ణ ఫంక్షన్ హాల్‌లో ఆధ్యాత్మిక సంఘాల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుపై చర్చించనున్నారు.



డీఎస్‌వీ ప్రసాద్ స్థపతి

అర్ధరాత్రి దారుణ హత్య

బైక్‌పై తీసుకెళ్లి నరికి చంపిన దుండగులు

పోలీసుల అదుపులో నిందితులు.. పురంలో కలకలం

హిందూపురం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన సద్దాం బేగ్(28) మంగళవారం రాత్రి హత్యకు గురయ్యాడు. మలుగూరు చెరువుకట్ట వద్ద అతన్ని నరికి చంపారు. అప్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులు తెలిపిన మేరకు, సద్దాం బేగ్‌కి ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరు పిల్లలున్నారు. శాంతినగర్‌లోని రేషం ఫ్యాక్టరీలో కూలి పని చేస్తుండేవాడు. ఇదే ఫ్యాక్టరీలో గడ్డమీద ప్రాంతానికి చెందిన మహ్మద్ షఫీ భార్య రేష్మా అలియాస్ ఆయేషా పనిచేస్తోంది. మహ్మద్ షఫీ మూడేళ్ల క్రితం రేష్మాను వదిలి అనంతపురంలో వేరే మహిళతో కలిసి ఉండేవాడు. ఈ నేపథ్యంలో సద్దాంబేగ్, రేష్మా మధ్య పరిచయం ఏర్పడి, చనువుగా ఉండేవారు. మహ్మద్ షఫీ 20 రోజుల క్రితం హిందూపురానికి వచ్చి, ఇక్కడే ఉంటున్నాడు. సద్దాంబేగ్, రేష్మా చనువుగా ఉండడాన్ని గమనించి, జీర్ణించుకోలేకపోయాడు. ఈ నెల 17వ తేదీ రాత్రి శాంతినగర్‌లోని రేషం ఫ్యాక్టరీకి వెళ్లి భార్యతో గొడవ పడ్డాడు. అక్కడే ఉన్న సద్దాంబేగ్ అడ్డుకోబోగా.. దాడికి యత్నించాడు. దీంతో షఫీపై సద్దాంబేగ్ దాడి చేశాడు. ఈ గొడవపై అదేరోజు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో షఫీ ఫిర్యాదు చేశాడు. మంగళవారం రాత్రి సద్దాంబేగ్, రేష్మా ఇంట్లో ఉండగా ఆ గదికి షఫీ, అతడి తమ్ముడు తౌఫిక్, సోదరి, తల్లి తాళం వేసి, టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు వారిని పిలిపించి, కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. సద్దాంబేగ్ తల్లికి ఆరోగ్యం బాగాలేక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండేది. అక్కడే ఉన్న సద్దాంబేగ్‌ను మంగళవారం అర్ధరాత్రి మహ్మద్ షఫీ, అతడి తమ్ముడు తౌఫిక్ కలిశారు. మాట్లాడేందుకని బైక్‌పై తీసుకెళ్లారు. గుడ్డంపల్లి-మలుగూరు దారిలో చెరువుకట్ట కింద కొడవలితో నరికి హత్యచేశారు. రేష్మా రాత్రి 12 గంటల సమయంలో డయల్ 100కి ఫోన్ చేసి సద్దాంబేగ్‌ను తన భర్త, మరిది తీసుకెళ్లినట్లు సమాచారం అందించింది. దీంతో పోలీసులు సాంకేతికత సాయంతో వెతికారు. అప్పటికే సద్దాంబేగ్‌ను చంపేశారు. పోలీసులు మహ్మద్ షఫీ, అతడి సోదరుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. హత్య విషయం తెలుసుకున్న సద్దాంబేగ్ కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని, బోరున విలపించారు. సద్దాంబేగ్ తల్లి షకీరా ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. డీఎస్పీ మహేష్, సీఐలు జనార్దన్, ఆంజనేయులు.. హత్యాస్థలాన్ని పరిశీలించారు. పుట్టపర్తి నుంచి క్లూస్‌టీమ్‌ను రప్పించి, పరిశీలించారు.



సద్దాం బేగ్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, ఇన్‌సెట్‌లో సద్దాం బేగ్ (ఫైల్)

న్యూస్ బాక్స్

పది పరీక్షకు ఎనిమిది మంది గైర్హాజరు

గార్లదిన్నె, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గార్లదిన్నె జడ్పీ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల, కల్లూరు ఉన్నత పాఠశాలల్లో బుధవారం హిందీ పరీక్ష నిర్వహించారు. ఈ మూడు కేంద్రాల్లో 727 మంది విద్యార్థులు హాజరు కావలి ఉండగా, ఎనిమిది మంది గైర్హాజరైనట్లు మండల విద్యా శాఖాధికారి తారా చంద్రానాయక్ తెలిపారు. ఎంఈఓ బుధవారం పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

శింగనమల, మార్చి19 (ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ఆరో తరగతి నుంచి 11 వ తరగ తి వరకు ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ఎస్ఓ గీతారాణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాల లో ఖాళీగా ఉన్న సీట్లకు ఈ నెల 22 నుంచి ఏప్రిల్ 11 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనాధలు, డ్రాపౌట్స్ (బండి మానివేసిన పిల్లలు), పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీఎల్ బాలికలు మాత్రమే అర్హులని ఎస్ఓ పేర్కొన్నారు.

అంగన్‌వాడీలకు ఒంటిపూట బడి

శింగనమల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ శింగనమల ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు బుధవారం నుంచి ఒంటి పూట బడి నిర్వహిస్తున్నట్లు సీడీపీఓ ఉమాశంకరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఒంటి పూట బడి నేపథ్యలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉదయం 8 నుంచి 12 గంటల వరకు ప్రీ స్కూల్ నిర్వహించి, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేస్తున్నామని సీడీపీఓ తెలిపారు.

దళితుల భూములు కాపాడాలి : సాకే హరి

రాప్తాడు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): దళితుల భూములు ఆక్రమణకు గురికాకుండా చూడాలని ఎస్సీ ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ విజయకుమారికి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు ఎల్లన్న, రామాంజినేయులు, నాగేష్, ఆంజినేయులు, నారాయణ స్వామి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుడి అరెస్ట్

అనంతపురం క్రైం, మార్చి19(ఆంధ్రజ్యోతి): రూరల్ మండల పరిధిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. కురుగుంటలో ఎరుకుల నాగరాజు బెల్ట్‌షాపు నిర్వహిస్తుండగా రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 20క్వార్టర్ల మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు.

చెరువులోకి చేపపిల్లలు


చెరువులో చేపపిల్లలను వదులుతున్న దృశ్యం

గార్లదిన్నె, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జంబులదిన్నె చెరువులో ప్రధాన మంత్రి మత్స్యసంపద యోజన (పీఎంఎంఎస్‌వై) పథకం ద్వారా వివిధ రకాలకు చెం దిన 12వేల చేపపిల్లలను ఉచితంగా వదిలారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ యోగానందరెడ్డి మాట్లాడుతూ... మత్స్యకారుల అభివృద్ధి కోసం వందశాతం రాయితీతో 12 వేల చేప పిల్లలను చెరువులోకి వదిలినట్లు తెలిపారు. సర్పంచు సుబ్బమ్మ, ఈఓఆర్డీ దామోదరమ్మ, మత్స్యశాఖ అధికారి ఆషీఫ్, వీఆర్వో సుధాకర్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, మత్స్యకారుల సంఘం అధ్యక్షులు నాగప్ప, మత్స్యశాఖ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

● రిజిస్ట్రార్ రమేష్ బాబు

అనంతపురం సెంట్రల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): న్యాయ విద్య కోర్సుల పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఎస్కేయూ రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు అధికారులను ఆదేశించారు. బుధవారం కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్(సీఈ) డాక్టర్ లోకేష్‌తో కలిసి ఆయన పరీక్షా కేంద్రాలను సందర్శించారు. వర్సిటీ పరిధిలోని తృతీయ సంవత్సరం ఎల్ఎల్‌బీ విద్యార్థులకు ప్రథమ సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ లోకేష్ వివరించారు. ప్రిన్సిపాల్ సోమశేఖర్‌తోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఐటీఐలో సర్టిఫికేషన్ డే

అనంతపురం సెంట్రల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బాలుర ఐటీఐలో బుధవారం సర్టిఫికేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ రామమూర్తి అధ్యక్షతన ఏర్పాటుచేసిన వేడుకలకు ఎంజీబీ మొబైల్స్ జీఎం రామకృష్ణ, హెచ్‌ఆర్ నరేంద్ర హాజరై ప్రారంభించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డీజిల్ మెకానిక్ ట్రేడ్ విభాగంలో రూ.4లక్షల వ్యయంతో టెక్ కార్నర్ ఏర్పాటు చేశామన్నారు. స్వల్పకాలిక శిక్షణ ఇచ్చి 70మంది విద్యార్థులకు సీఈఓ సర్టిఫికెట్లను ప్రదానం చేశామన్నారు. ఇందుకు ఎంజీబీ సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

కనగానపల్లి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల నుంచి సమీప గ్రామాల్లోని పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు ఆర్డీటీ ఆధ్వర్యంలో ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. మామిళ్ళపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో చదివే 61 మంది విద్యార్థులకు బుధవారం ఆ గ్రామంలోని ఆర్డీటీ కార్యాలయంలో అందజేశారు. స్పానిష్ దేశం నుంచి వచ్చిన స్పాన్సర్లు చేతుల మీదుగా వాటిని విద్యార్థులకు అందజేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో మామిడి తోట దగ్ధం


కాలిపోయిన మామిడి చెట్లు, డ్రిప్పు పరికరాలు

నార్పల, మార్చి 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి మండల కేంద్రం సమీపంలోని మామిడి తోట మొత్తం కాలిపోయింది. మండలకేంద్రానికి చెందిన పున్నపు లక్ష్మీనారాయణ అనే రైతు దా దాపు నాలుగెకరాల్లో మామిడి చెట్లను పెంచుతున్నాడు. రోజు లాగానే రైతు బుధవా రం పొలం పనులు ముగించుకొని ఇంటికెళ్లాడు. ఇంతలోగా తోటపై భాగాన ఉన్న విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగులుకొని నిప్పురవ్వలు చెట్లపై పడ్డాయి. దీంతో మంటలు చెలరేగి మామిడి చెట్లు, డ్రిప్పు పరికరాలు పూర్తిగా కాలిపోయాయని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. పంటకోసే సమయంలో ఇలా జరిగిందని, దాదాపు రూ. 10లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరాడు. మామిడి తోటను రెవెన్యూ అధికారు లు పరిశీలించి నష్టాన్ని అంచనావేశారు. నివేదికను పైఅధికారులకు పంపుతామని తెలిపారు.


వరిమడుగు వద్ద శిథిలమైన చెక్ డ్యాం


పాలచెర్ల వద్ద..

శిథిలమైన చెక్‌డ్యాంలు

● రైతులు, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు

రాప్తాడు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వరిమడుగు నుంచి పాలచెర్లకు వెళ్లే దారిలో పండమేరు వంకపై నిర్మించిన రెండు చెక్‌డ్యాంలు శిథిలమయ్యాయి. దీంతో ఆ దారి గుండా రైతులు ద్విచక్రవాహనాలు, ఇతర వాహనాల్లో రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతు న్నారు. వరిమడుగు నుంచి పాలచెర్లకు వెళ్లే దారిలో పండమేరు వంకపై నీటి ప్రవాహం కోసం, వాహనాలు వెళ్లేందుకు వీలుగా కొన్నేళ్ల కిందట చెక్‌డ్యాంలు నిర్మించారు. ప్రతి ఏడాది వర్షపు నీరు, హంద్రీనీవా నీరు ఈ చెక్‌డ్యాంల మీదుగా రాప్తాడు నుంచి అనంతపురం చెరువు లోకి వెళతాయి. ఈ ఏడాది ఖరీఫ్‌లో పండమేరు వంక ప్రాంతంలో భారీ వర్షాలు కురవడంతో పాటు, హంద్రీనీవా నీరు ఎక్కువగా ప్రవహించడంతో నీటి ఉధృతికి ఆ చెక్‌డ్యాంలు దెబ్బతిన్నాయి. చెక్‌డ్యాంలు దెబ్బతినడంతో పెద్ద పెద్ద రాళ్లు దర్శనమిస్తున్నాయి.

రాకపోకలకు ఇబ్బందులు

మండలంలోని బోగినేపల్లి, పాలచెర్ల గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రమైన రాప్తాడుకు ఈ దారి గుండానే వెళ్లాలి. అలాగే వరిమడుగు ప్రజలు, రైతులు పొలాలకు వెళాలన్నా ఆ దారి గుండా వెళ్లాల్సిందే. రైతులు పండించిన పంటలన, పశుగ్రాసాన్ని పొలాల్లో నుంచి ఇంటి వద్దకు తరలించేందుకు ఆ దారి ఒక్కటే ఉంది. చెక్‌డ్యాంలు దెబ్బతిని ప్రస్తుతం ఆ దారి బాగా లేకపోవడంతో రాకపోకలకు ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పండమేరు వంకపై నీరు ప్రవహించే సమయంలో చెక్‌డ్యాం దారిలో గుంతలు, రాళ్లు ఉండటంతో ప్రమాదవశాత్తు కింద పడి గాయాల పాలవుతున్నారు.

మరమ్మతులు పట్టించుకోని గత పాలకులు

గత వైసీపీ ఐదేళ్ల పాలనలో చెక్‌డ్యాంలకు కనీస మరమ్మతులు కూడా చేయలేదు. ఈ ఏడాది భారీ వర్షాలు కురవడంతో నీటి ఉధృతికి రెండు చెక్‌డ్యాంలు పూర్తిగా దెబ్బతిని పెద్దపెద్ద రాళ్లు దర్శనమిస్తున్నాయి. ఇప్పుడైనా అధికారులు, పాలకులు స్పందించి చెక్‌డ్యాంలకు మరమ్మతులు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేయాలి



గ్రామ సమీపంలో పాలచెర్లకు వెళ్లే దారిలో పండమేరు వంకపై నిర్మించిన చెక్‌డ్యాం రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఈ దారి గుండా రైతులు పాలచెర్ల, బోగినేపల్లి గ్రామాలకు ఎక్కువగా వెళుతుంటారు. పండమేరు వంకలో నీరు ప్రవహించే సమయంలో వాహనాల రాకపోకలకు ఎంతో ఇబ్బందికరం. వెంటనే చెక్‌డ్యాంకు మరమ్మతులు చేయాలి.

- ప్రశాంత్, వరిమడుగు

● వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చండి



అనంతపురం అర్బన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 40 లక్షల జనాభా ఉన్న వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని సీఎం చంద్రబాబునాయుడును వడ్డెర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవళ్ల మురళి కోరారు. ఈ మేరకు బుధవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబుకు ఆయన వినతిపత్రం అందజేశారు. అలాగే ఇవే విషయాలపై మంత్రులు నారా లోకేశ్, సవిత, అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, పలువురు ఎమ్మెల్యేలకు ఆయన వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శ్రీనివాసులు, అంజినప్ప, రెడ్డి శేఖర్, మునిస్వామి, రఘు తదితరులు పాల్గొన్నారు.

● పాములాయి చెరువుకు నీరు ఇవ్వండి



అనంతపురం రూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): హె చ్చెల్సీ ద్వారా తమ గ్రామానికి చెందిన చెరువుకు నీరు ఇవ్వాలని మండలంలోని పాములాయి గ్రామస్థులు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే ప రిటాల సునీత, టీడీపీ ధర్మవరం నియోజకవర్గం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌తో కలసి వారు బుధవారం అసెంబ్లీ ప్రాంగణంలో మంత్రి వద్దకు వెళ్లారు. తమ గ్రామంలో నీటి సమస్య గురించి మంత్రికి వివరించి, వినతి పత్రం అందజేశారు.

● బీటీ నాయుడుకి శుభాకాంక్షలు

ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన బీటీ నాయుడును మంత్రి సవిత, ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ కలిసి, ఆయనకు శుభాకాం క్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులు, పొడరాళ్ల సాగునీటి సంఘం అధ్యక్షుడు రామ్మోహన్, నాయకులు విశ్వనాథ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో అలసత్వం తగదు: కమిషనర్

అనంతపురం క్రైం, మార్చి19(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనుల్లో అలసత్వం తగదని నగర కమిషనర్ బాలస్వామి స్పష్టం చేశారు. ఆయన బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రధాన కూడళ్లలో చెత్త ఎత్తివేయాలని ఆదేశించారు. పాతూర్లో డోర్ టు డోర్ చెత్త సేక రణ పై ఆరా తీశారు. తిలక్‌రోడ్డులో పైపులైన్ లీకేజీ మరమ్మతులను పరిశీలిం చారు.

2,535 మందికి ప్రయోజనం: కమిషనర్

నగరంలో ప్రభుత్వ ఇళ్లు మంజూరై వివిధ దశల్లో ఉన్న ఉన్న 2,535మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాల లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసినట్లు కమిషనర్ బాలస్వామి తెలిపారు. ఆయన తన చాంబర్‌లో హౌసింగ్ డిపార్ట్‌మెంట్, వార్డు అమెనిటీస్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై సమీక్షించారు. బీసీ, ఎస్సీ కులాల వారికి రూ. 50వేలు, ఎస్టీ కులాల వారికి రూ.75వేలు అందించనున్నారని తెలిపారు. సమావేశానికి హాజరుకాని వారికి మెమోలు జారీ చేశారు.

నాటు సారాను నిషేధించండి

● ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

శింగనమల, మార్చి 19(ఆంధ్రజ్యోతి): తండా ప్రాంతాల్లో అనాదిగా వస్తున్న నాటుసారా తయారికి స్వస్తి చెప్పి, పిల్లల మంచి భవిష్యత్తుకు నాం ది పలికే బాధ్యత తండా వాసులకు ఉందని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య పెర్కొన్నారు. మండలంలోని నాగులగుడ్డం తండాలో మంగళవారం నాటు సారా నిర్మూలనలో భాగంగా చేపట్టిన నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగమద్దయ్య హాజరై మాట్లాడారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి, బుక్కరాయసముద్రం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నాగ సునీతా రాణి, సర్పంచ్ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

●చెన్నేకొత్తపల్లి: నాటుసారాను సమూలంగా నిర్మూలించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని, అందుకు అందరూ సహకరించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి గోవిందనాయక్ పేర్కొన్నారు. మండలంలోని గంగినేపల్లి దిగువ తండా, మేడాపురం గ్రామాల్లో బుధవారం నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాజాతా బృందం ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ ఫరూక్ అజం, ఎస్ఐ శివప్రసాద్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అశోక్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'త్వరలో ఆదరణ-3 పథకం అమలు'

అనంతపురం అర్బన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు త్వరలో ఆదరణ-3 పథకాన్ని అమలు చేయనున్నట్లు నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కడియాల కొండన్న పేర్కొన్నారు. బుధవారం స్థానిక బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో ఈడీ సుబ్రహ్మణ్యం, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కడియాల కొండన్న నాయీ బ్రాహ్మణులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆదరణ పథకం -3లో నాయీ బ్రాహ్మణులకు కావాల్సిన పనుముట్లు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చిం చారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో అనంతపురం అర్బన్ పరిధిలోని అర్హులైన నాయీబ్రాహ్మణులకు అన్ని రకాలుగా లబ్ధి జరిగేలా చొరవ చూపుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు రామాంజినేయులు, లింగమయ్య, తిమ్మప్ప, వెంకటేశులు, తాడిమర్రి సురేంద్ర, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

తెలుగు యువత రమేష్ జన్మదిన వేడుకలు


రమేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

అనంతపురం అర్బన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ బలిజ సంఘం జిల్లా యువజన అధ్యక్షుడు, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు తొండపునాటి రమేష్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ముందుగా స్థానిక బాలాజీ కల్యాణ మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడే టీడీపీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఆయన కేక్ కట్ చేశారు. ఆ తర్వాత స్థానిక మున్నానగర్‌లోని ఆయన నివాసం వద్ద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. నగరంలోని పలు అనాథ ఆశ్రమాల్లోని వృద్ధులు, మహిళలకు దుస్తులు పంపిణీ చేయడంతోపాటు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఫోన్ ద్వారా రమేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు గంగారామ్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్, నాయకులు సుందర్, రాయల్ మధు, జోగి రాజేంద్ర, శ్రీధర్, తాటి మధు, మహేష్, ఓం కార్ రెడ్డి, బలిజ సంఘం నాయకులు రవికాంత్‌రమణ, రుపణగుడి రవి కుమార్ తదితరులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

రెండోరోజూ క్రీడాపోటీల్లో ఎమ్మెల్యేలు


క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి


క్యారమ్స్ ఆడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం అర్బన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో రెండో రోజు నిర్వహించిన క్రీడా పోటీల్లో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ఉత్సాహంగా పాలొ న్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మ్యూ జికల్ చైర్స్, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్, క్యారమ్స్ పోటీల్లో పాల్గొన్నారు. తన తోటి ఎమ్మెల్యేలతో ఉత్సాహంగా ఆయా పోటీల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ క్రికెట్, రన్నింగ్ రేస్‌ల్లో పాల్గొన్నారు. ఆయన వేగంగా పరుగులు తీస్తూ ఆకట్టుకున్నారు.

ఆడపిల్లల స్వీయరక్షణకే అనంత ఆత్మరక్షణ

● అసిస్టెంట్ కలెక్టర్ బొల్లినేని వినూత్న


ప్రశంసాపత్రం అందజేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

అనంతపురం టౌన్, మార్చి19(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో జరుగుతున్న అరాచకాలను ధైర్యంగా ఎదుర్కొని ముందుకుసాగేందుకు ఆడపిల్లలకు స్వీయరక్షణ కోసం అనంత ఆత్మరక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు అసిస్టెంట్ కలెక్టర్ బొల్లినేని వినూత్న పేర్కొన్నారు. అనంత ఆత్మరక్షణ ముగింపు కార్యక్రమాన్ని బుధవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమం నిర్వహణకు తోడ్పాటునందించిన మహిళా అధికారులు, శిక్షకులు, నైపుణ్యాలు నేర్చుకుని ప్రతిభచాటిన అమ్మాయిలకు అసిస్టెంట్ కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. అనంతరం అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ... కలెక్టర్ సహకారంతో జిల్లాలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఐసీడీఎస్ నేతృత్వంలో ఈ ఏడాది ఫిబ్రవరి 20నుంచి దాదాపు 100 విద్యాసంస్థలలో చదువుతున్న 50వేలమంది ఆడపిల్లలకు ఈ నైపుణ్యాలు నేర్పించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో 495 స్కూళ్లలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇదేస్ఫూర్తితో లక్ష మంది ఆడపిల్లలకు స్వీయరక్షణ నైపుణ్యాలు నేర్పించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ నాగమణి, బీసీ వెల్ఫేర్ శాఖ డీడీ కొఠారి కుష్బూ, ఎస్ఎస్ఏ ఏపీసీ శైలజ, ఉరవకొండ సీడీపీఓ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వీఎస్ఏలకు ఉద్యోగోన్నతి

అనంతపురం సెంట్రల్, మార్చి19(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్ (వీఎస్ఏ)లకు పట్టు పరిశ్రమ శాఖలో టెక్నికల్ అసిస్టెంట్స్(టీఏ) ఉద్యోగోన్నతులు లభించాయి. అధికారుల వివరాల మేరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 153మంది వీఎస్ఏలు పనిచేస్తున్నారు. అర్హత, అనుభవం ప్రాతిపదికన 69మందికి టీఏలుగా ఉద్యోగోన్నతి కల్పించారు.

జేఎన్టీయూలో పలువురికి...

జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో పలువురికి ఉద్యోగోన్నతులు కల్పించారు. వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య ఆదేశాల మేరకు బుధవారం ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. మేస్త్రీగా కృష్ణకుమార్, జూనియర్ అసిస్టెంట్‌గా విష్ణువర్ధన్‌రెడ్డి, రికార్డ్ అసి స్టెంట్లుగా పవన్‌కుమార్, మారెన్న, బ్లాక్‌స్మిత్‌గా నరసింహుడు, అసిస్టెంట్ కుక్‌గా గోపి ఉద్యోగోన్నతులు పొందారు. వారిని వీసీ, రిజిస్ట్రార్ అభినందించారు.

మార్కెట్‌కు వెయ్యి టన్నుల చీనీ కాయలు

అనంతపురంరూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు చీనీ కాయల రాక పెరిగింది. గత మూడు నాలుగురోజులుగా 500 టన్నుల నుంచి 800 టన్నుల మధ్య చీనీ ఉత్పత్తులు మార్కెట్ వస్తున్నాయి. బుధవారం 1045 టన్నుల కాయలు మార్కెట్‌కు వచ్చాయి. అధికారులు ఈనామ్ పద్ధతిలో వేలం నిర్వహించారు. టన్ను గరిష్ఠంగా రూ.27వేలు, కనిష్ఠంగా రూ.3వేలు, సరాసరి రూ.16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు.

టమోటా కిలో రూ.8

అనంతపురం రూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.8తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు బుధవారం 100 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయ న్నారు. కిలో సరాసరి ధర రూ.7, కనిష్ఠ ధర రూ.6 పలికినట్లు ఆయన తెలిపారు.

దుర్గమ్మ సేవలో ఎమ్మెల్యే దగ్గుపాటి కుటుంబం


దుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, కుటుంబ సభ్యులు

అనంతపురం అర్బన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): విజయవాడ కనకదుర్గ ఆలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఆయన కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఆలయంలో నిర్వహించిన దుర్గమ్మ ఖడ్గమాలార్చన సేవలో ఎమ్మెల్యే దగ్గుపాటి, ఆయన సతీమణి శ్రీలక్ష్మి, కుమారుడు, కుమార్తె పాల్గొన్నారు. కుమారుడు మణిహాస్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యేతో పాటు ఆయన కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా పూజలు చేశారు.

పీఎస్ హెచ్‌ఎంల సమస్యలు పరిష్కరించండి

● డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతి

అనంతపురం విద్య, మార్చి 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైమరీ స్కూళ్ల ప్రధానోపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ప్రైమరీ స్కూళ్ల ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు డీఈఓను కోరారు. బుధవారం ఆ సంఘం నాయకులు సైన్స్ సెంటర్‌లో డీఈఓ ప్రసాద్ బాబును కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆ స ంఘం రాష్ట్ర కార్యదర్శులు వెంకటరమణ, మర్రిస్వామి, ఇతర నాయకులు ఈశ్వరయ్య, మురళీప్రసాద్, జనార్దనరెడ్డి, రాజేంద్ర, ఈశ్వరయ్య, గంగరాజు, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలను అభివృద్ధి చేయాల్సిందే : డీఎఫ్ఓ

అనంతపురం న్యూటౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి) జిల్లాలో నర్సరీల అభివృద్ధికి ఎక్కడా ఆటంకం కలగడానికి వీలు లేదని, కావాల్సిన నిధులు సమకూరుస్తామని డీఎఫ్ఓ చంద్రశేఖర్ సిబ్బందికి సూచించారు. స్థానిక సోషల్ ఫారెస్ట్ కార్యాలయంలోని డీఎఫ్ఓ చాంబర్‌లో ఇన్‌చార్జ్ రేంజర్ దీపా, సెక్షన్ ఆఫీసర్ మల్లికార్జునతో కలిసి డీఎఫ్ఓ చంద్రశేఖర్ సోమవారం ఫీల్డ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వారం లోగా జిల్లాలోని అన్ని నర్సరీల్లో టార్గెట్‌కు అనుగుణంగా మొక్కలు పెంచడానికి క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించాలని ఆదేశించారు.

పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుపడాలి : డీపీఓ

అనంతపురం న్యూటౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుపడాలని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజనాయుడు పెర్కొన్నారు. ఆయన బుధవారం ఆత్మకూరు మండలంలోని వడ్డిపల్లి పంచాయతీలో అకస్మిక తనిఖీలు చేపట్టి పరిశీలించారు. గడువులోగా డిమాండ్‌కు అనుగుణంగా పన్ను వసూళ్లు చేయాలని ఆదేశించారు.

● నార్పల: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని డివిజనల్ పంచాయతీ అధికారి విజయ్‌కుమార్‌రెడ్డి తనిఖీ చేశారు. ఇంటి పన్నులు, కొళాయి పన్నులు, అంగడి లైసెన్సులను గ్రామ సచివాలయం సిబ్బంది, పంచాయతీ సిబ్బంది వసూలు చేయాలని తెలియజేశారు. పంచాయతీ కార్యదర్శి శ్యామల, సచివాలయ సెక్రెటరీలు చరణ్, శ్రీనివాసులు, పరశురాం, సిబ్బది పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో సవరణలు చేయండి

రాప్తాడు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): చనిపోయిన వారిని, డబుల్ ఓటర్ల ను ఓటరు జాబితా నుంచి ఎప్పటి కప్పుడు తొలగించాలని హెచ్చెల్సీ డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్ తెలిపారు. ఆయన బుధవారం స్థానిక తహసీ ల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. రాప్తాడు, ఆత్మకూరు తహసీల్దార్లు విజయలక్ష్మి, లక్ష్మీ నాయక్, టీడీపీ కనగానపల్లి మండల కన్వీనర్ పోతులయ్య, ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు, సుధాకర్‌చౌదరి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి

అనంతపురం రూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ లిక్కర్ గోదాముల్లో పనిచేసే హమాలీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోములదొడ్డిలోని ఐఎంఎఫ్ఎల్ లిక్కర్ గోదాములో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 22, 23తేదీల్లో నిర్వహించే ఏఐటీయూసీ జిల్లా స్థాయి శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని కోరారు.

హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక


ఎంపికైన బాలికల జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ బాలికల జట్టును ఎంపిక చేశారు. బుధ వారం స్థానిక న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. జట్టు వివరాలను జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్‌రియాజ్, కార్యదర్శి సాకే శివశంకర్ ప్రకటించారు. జట్టులో ధనూష, గీతిక, సంధ్య, నిర్మల, మౌనిక, నందిని, హర్షవల్లి, మేఘన, మంజుల, మహేశ్వరి, మధుమతి, తేజస్విని, ధనలక్ష్మి, హర్షప్రియ, ఇందు, లిఖిత ఉన్నారు. ఈ జట్టు గురు, శుక్రవారాల్లో విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ హ్యాండ్‌బాల్ క్రీడాకారులు ఉదయ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రేపు జాబ్‌మేళా

ఉరవకొండ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నముష్టూరు పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీ శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ అష్రఫ్ అలీ బుధవారం ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ పాసైన వారు అర్హులన్నారు. హోండా మోటార్స్ క్రియేటివ్ ఇంజనీర్స్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పూడిక తీత పనులకు భూమిపూజ

గుంతకల్లుటౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జగ్జీవన్‌రాం కాలనీ వద్ద ఉన్న గుత్తి సబ్ బ్రాంచ్ కాలువ (జీఎస్‌బీసీ)లో పూడిక తొలగింపు పనులకు టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు బండారు ఆనంద్, కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, పత్తి హిమబిందు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

గుంతకల్లుటౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని న్యాక్ కోచింగ్ సెంటర్‌లో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సహకారంతో నిరుద్యోగ యువతీ, యువకులకు ల్యాండ్ సర్వేయర్, ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ గోవిందరాజులు బుధవారం ప్రకటనలోతెలిపారు. పీఎంకేవీవై4.0 పథకం కింద ఉచిత శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్‌తో పాటు ప్రముఖ కంపెనీలో ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. టెన్త్ ఆపైన చదివిన వారందరూ అర్హులన్నారు. ఈనెల 24వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తి గల వారు 7913858450, 8555841466కు సంప్రదించాలని సూచించారు.

వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని వినతి

గుంతకల్లుటౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ బుధవారం విజయవాడలో రాష్ట్ర బీసీ సంక్షేమశాఖా మంత్రి సవితకు వడ్డెర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంజుల మునిస్వామి, వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవళ్ల మురళి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో వడ్డెర్లు దాదాపు 30లక్షల మంది ఉన్నారన్నారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ఎస్టీ జాబితాలో చేర్చాలని తీర్మానం చేసి కేంద్రానికి సిఫారసు చేయాలని కోరారు.

వ్యాక్సినేషన్ పరిశీలన

ఉరవకొండ, మార్చి19(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం చాబాల గ్రామంలో బుధవారం జరిగిన పశువుల వ్యాక్సినేషన్‌ను పశుసంవర్ధక శాఖ డీడీ వెంకటేశ్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడి పశువుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గాలికుంటు నివారణ టీకాలను నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు వేయించాలని రైతులకు సూచించారు. పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

శెట్టూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని కేజీబీవీలో 6 నుంచి 11వ తరగతి వరకు మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌ఓ లలిత బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి వచ్చే నెల 11వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కూడేరు: మండలకేంద్రంలోని కేజీబీవీలో ఆరో తరగతిలోను, ఇంటర్ బైపీసీ కోర్సులోనూ సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తిగల విద్యార్థినులు ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చునని ఎస్‌ఓ ఉమాదేవి ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో 40 సీట్లు, ఇంటర్ బైపీసీ కోర్సులో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ నెల 22 నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు.

1న రాతిదూలం లాగుడు పోటీలు

పుట్లూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయకునిపల్లి గ్రామశివారులో వెలసిన బాటసుంకులమ్మ అమ్మవారి తిరుణాల సందర్భంగా ఏప్రిల్ 1వ తేదీన ఒంగోలు జాతి కోడెలతో రాతిదూలం బండలాగుడు పోటీలను నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన వృషభాల యజమానులకు మొదటి బహుమతిగా రూ.60వేలు, రెండో బహుమతిగా రూ.50 వేలు, మూడో బహుమతిగా రూ.40వేలు, నాలుగో బహుమతిగా రూ.30 వేలు, ఐదో బహుమతిగా రూ.25వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. వివరాలకు 9000181929, 9951066080 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మహిళ ఆత్మహత్య

రాయదుర్గంరూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో నివాసముంటున్న నాగరత్నమ్మ(28) అనే మహిళ బుధవారం ఆత్మహత్య చేసుకుంది. నాగరత్నమ్మ పట్టణంలో మహిళా సంఘం సభ్యురాలుగా ఉంటోంది. అయితే కుటుంబ కలహాలతో విసిగిపోయి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోందని పోలీసులు భావిస్తున్నారు. మృతికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ జయనాయక్ పేర్కొన్నారు.

రైలు కింద పడి యువకుడు..


మహేంద్ర (ఫైల్)

గుత్తి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్‌ఐ నాగప్ప తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం గురుమానపల్లికి చెందిన శ్రీరాములు, మునెమ్మ దంపతుల కుమారుడు మహేంద్ర(25) యాడికి మండలంలోని పెన్నా సిమెంట్ ఫ్యాక్టరీలో కూలిపని చేస్తూ జీవనం సాగించేవాడు. అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా మనస్తాపానికి గురైన అతను బుధవారం గుత్తి రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫాంనెంబర్-1లో చెన్నై సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. యువకుడి వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా వారి కుటుంబసభ్యులకు సమాచారం అందజేశామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని రైల్వే ఎస్‌ఐ పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో గోనేహాళ్ విద్యార్థి ప్రతిభ


విద్యార్థికి ప్రశంసాపత్రం అందిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పులివెందులలో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో మండలంలోని గోనేహాళ్ గ్రామానికి చెందిన విద్యార్థి వరుణ్‌కుమార్ ప్రతిభ చాటాడు. తొలుత జిల్లా జట్టుకు ఎంపికై రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచాడు. సందర్భంగా బుధవారం స్థానిక పాఠశాలలో స్కూల్ కమిటీ చైర్మన్ రాజశేఖర్, హెచ్‌ఎం కాళిదాసురాజు, గ్రామస్థులు.. విద్యార్థికి ప్రశంసాపత్రం ఇచ్చి అభినందించారు.

చిరు వ్యాపారులకు సుంకం రద్దు చేయాలి


ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

గుంతకల్లు టౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో చిరు వ్యాపారులకు సుంకం రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ.. చిరువ్యాపారులకు సుంకం రద్దు చేస్తామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం గత కౌన్సిల్ సమావేశంలో చెప్పారన్నారు. కనుక రద్దు చేయాలని అన్నారు. అలాగే చిరువ్యాపారులపై పోలీసుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు సాకేనాగరాజు, సురేంద్ర, నాగరాజు, శివన్న, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

గుడికి.. బడికీ పరిహారం..!

- ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో వింతలు
- వైసీపీ నాయకులు, ఉన్నతాధికారి కుమ్మక్కు
- జాబితాలో వెలుగుచూసిన అక్రమాలు


జాబితాలోని 386 నంబర్‌లో ఉన్న ఆంజనేయస్వామి ఆలయం


జాబితాలో 385లో ఉన్న ప్రభుత్వ పాఠశాల

బెళుగుప్ప, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరు ఊటనీటి ముప్పు నుంచి బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారం అనర్హులు కాజేందుకు సిద్ధమయినట్లు వెలుగులోకి వచ్చింది. గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయం, ప్రభుత్వ పాఠశాల పేర్లు కూడా ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీ జాబితాలో చేర్చారు. 2022లో వైసీపీ హయాంలో సర్వే చేసి నివేదిక తయారు చేశారు. ఉన్నతాధికారి వైసీపీ నాయకులు కుమ్మక్కై జాబితా సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపారు. 657 యూనిట్లు ఉన్నాయని, ఒక్కొక్క యూనిట్‌కు రూ.10 లక్షల పరిహారంతోపాటు 18 ఏళ్లు నిండిన వారికి అదనంగా రూ.10 లక్షల అందేలా జాబితా సిద్ధం చేశారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చొరవతో రూ.131 కోట్లు మంజూరయ్యాయి. హంద్రీనీవా, రెవెన్యూశాఖ అధికారులు, బ్యాంకు ఖాతాలు, ఆధార్ కార్డులు సేకరించడానికి గ్రామంలో జాబితాతో గ్రామసభ నిర్వహించగా అక్రమాలు వెలుగుచూశాయి. 386వ నంబరులో ఆంజనేయస్వామి ఆలయం వుంది. 385 నంబరులో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఉంది. పరిహారం జాబితాలో ఆలయానికి చిన్న మారెన్న కుమారుడు శ్రీరాములు, పాఠశాలకు పెద్ద మారెన్న కుమారుడు సురేష్ పేర్లు నమోదు చేశారు. వీటితో పాటు 15 ఏళ్లు వున్న వారి పేర్లు కూడా 18 ఏళ్లు నిండినట్లు అవకతవకలకు పాల్పడ్డారని, వైసీపీ నాయకుల అక్రమాలతో అర్హులకు అన్యాయం జరుగుతోందని, విచారించి అనర్హుల పేర్లు తొలగించాలని టీడీపీ నాయకులు తిమ్మప్ప దామోదర తదితరులు కోరారు.

పొరపాట్లను సవరించండి

- రాష్ట్ర రెవెన్యూ మంత్రికి ప్రభుత్వ విప్ కాలవ వినతి


రెవెన్యూ మంత్రికి వినతిపత్రం అందిస్తున్న కాలవ

డీ.హీరేహాళ్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మలపనగుడి గ్రామంలో పలువురి రైతుల సొంత భూములు అటవీభూములుగా రెవెన్యూ రికార్డుల్లోకి ఎక్కాయని, ఈ పొరపాటును సవరించాలని రాష్ట్ర రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్‌ను ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు కోరారు. అమరావతిలోని అసెంబ్లీ భవనంలో గల ఛాంబర్‌లో బుధవారం ఆయన మంత్రిని కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. మలపనగుడి గ్రామ పరిధిలోని పలువురు రైతుల భూములను గత వైసీపీ హయాంలో జరిగిన రీ సర్వేలో పొరపాటున అటవీభూముల రికార్డుల్లోకి ఎక్కించారన్నారు. ఆ పొరబాటును సరిదిద్ది ఆ భూములను రైతుల పేర్లతో సవరించాలని కోరారు. స్పందించిన మంత్రి వెంటనే భూసర్వే, రెవెన్యూ ల్యాండ్ రికార్డ్స్ సంచాలకులు ప్రభాకర్‌రెడ్డికి సవరణపై చర్య తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు హనుమంతరెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ పరిశ్రమలను ఆదుకోండి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే, పరిశ్రమల యజమానులు

తాడిపత్రి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): గ్రానైట్ పరిశ్రమలు కుదేలయ్యాయని, ఆదుకోవాలని తాడిపత్రి గ్రానైట్ పరిశ్రమల యజమానులు బుధవారం ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డితో కలిసి మైనింగ్ మంత్రి కొల్లు రవీంద్రకు విన్నవించారు. విజయవాడలో బుధవారం వారు మంత్రిని కలిసి మాట్లాడారు. గత ప్రభుత్వంలో రాయల్టీ, విద్యుత్ చార్జీలు భారీగా పెరగడం వ ల్ల గ్రానైట్ పరిశ్రమ కుదేలైందన్నారు. ప్రస్తుత పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయన్నారు. రాయల్టీ, విద్యుత్ బిల్లులు తగ్గించినట్లయితే పరిశ్రమ బతుకుతుందని తెలిపారు. గతంలో తాడిపత్రి పరిసర ప్రాంతాల్లో 650గ్రానైట్ పరిశ్రమలు ఉండేవని, ప్రస్తుతం వందలోపే ఉన్నాయని వాపోయారు. మంత్రి స్పందిస్తూ విచారించి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు యజమానులు తెలిపారు.

నేమకల్లులో సీసీ రోడ్ల నిర్మాణం ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న అధికారులు

బొమ్మనహాళ్, మార్చి19(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణాన్ని బుధవారం అధికారులు ప్రారంభించారు. గత ఏడాది నవంబరులో సీఎం చంద్రబాబు గ్రామంలో పర్యటించి నేమకల్లును ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఇచ్చిన హామీ ఇచ్చారని, ఆ మేరకు రూ. 2.10 కోట్ల వ్యయంతో 50 సీసీరోడ్లు, రూ. కోటి వ్యయంతో 100 డ్రైనేజీల నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు పంచాయతీరాజ్ ఈఈ గార్లపాటి ప్రభాకర్‌రెడ్డి, డీఈఈ సుధాకర్‌నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాసులు, బొమ్మనహాళ్ తహసీల్దార్ మునివేలు తెలిపారు. సీసీరోడ్ల పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, త్వరితగిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈలు జగదీష్, శ్రీనివాసనాయక్, ఎంపీటీసీ చిక్కణ్ణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

- బీసీ సంఘం నాయకుల డిమాండ్

పామిడి/గుత్తి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రామగిరి ఎస్‌ఐ సుధాకర్ యాదవ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని బీసీ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని అటవీశాఖ విశ్రాంతి భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీసీ ఐక్యవేదిక నాయకుడు అశ్వర్థ మాట్లాడారు. నిజాయితీగా విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ సుధాకర్ యాదవ్‌ను ప్రకాష్‌రెడ్డి అగ్రకుల అహంకారంతో దూషించడం తగదన్నారు. ఆయన ఎస్‌ఐకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. లేకపోతే బీసీ సంఘాల నేతృత్వంలో బీసీలు ఏకమై ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్ యాదవ్, పక్కీరప్ప, శేఖర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. గుత్తి పట్టణంలో అఖిల భారత యాదవ్ సంఘం మండ ల నాయకులు విలేకరులతో మాట్లాడుతూ తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి వ్యాఖ్యలను ఖండించారు. ఆయన బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. నాయకులు శ్రీనివాసయాదవ్, సుధాకర్, బోడెశ్రీనివాసయాదవ్ తదితరులుపాల్గొన్నారు.

ఎంపీడీఓ శ్రీనివాసులుపై చర్యలు తీసుకోవాలి

- డిప్యూటీ సీఎంకు వైసీపీ నాయకుడి ఫిర్యాదు

విడపనకల్లు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలో గత వైసీపీ పాలనలో జరిగిన ఉపాధిహామీ పనుల్లో అవినీతి అక్రమాలకు పాల్పడిన ఎంపీడీఓ ఏవీ శ్రీనివాసులుపై చర్యలు తీసులకోవాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు వైసీపీ నాయకుడు బోయ రాంబాబు ఫిర్యాదు చేశాడు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో గత మంగళవారం ఆయన డిప్యూటీ సీఎంను కలిసి మాట్లాడారు. గత ప్రభుత్వంలో పంచాయతీ తీర్మాణాలు లేకుండా ఎంపీడీఓ తమ అనుకూలపైన వారిని ఏర్పాటు చేసుకుని, వారితో పనులు చేయించినట్లు బిల్లులు డ్రా చేయించారని తెలిపారు. ఎంపీడీఓ చేసిన అవినీతిపై తమ వద్ద ఆధారాలున్నాయని చెప్పారు. ఆ అధికారిపై చట్టపరమై చర్యలు చేపట్టాలని, నిధులను రీకవరీ చేయాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం

బ్రహ్మసముద్రం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్ కోనాపురం గ్రామంలో సర్పంచ్ వనిత చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దానిని బుధవారం ఎంపీడీవో నందకిషోర్, ఈవో ఆర్డీ రంగనాయకులు ముఖ్య అతిథిగా వచ్చి ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి అనిత, క్లస్టర్ ఇన్‌చార్జి ఓబుశేసు, సచివాలయ సిబ్బంది, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

జేసీపీఆర్‌కు ఘన సన్మానం


జేసీపీఆర్‌కు స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న సభ్యులు

తాడిపత్రి, మార్చి19(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిని పట్టణంలోని ఆయన నివాసంలో బుధవారం యాడికి లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి స్వామి వారి చిత్రపటం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయడంలో జేసీపీఆర్ ప్రత్యేక చొరవే చూపారని తెలిపారు. ఈ సందర్భంగా సన్మానించినట్లు చెప్పారు. సభ్యులు వేలూరు రంగయ్య, రుద్రమనాయుడు, సుబ్రమణ్యం, బాలరాజు, రాజశేఖర్, ఆదినారాయణ, విక్రమ్, గండికోట లక్ష్మణ్ పాల్గొన్నారు.

శేషవాహనంపై వెంకటరమణుడు


శేషవాహనంపై దర్శనమిస్తున్న ఉత్సవమూర్తులు

యల్లనూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని లక్ష్మీవెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారు శేషవాహనంపై దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయమే ఆలయంలోని స్వామివారి మూలవిరాట్‌ను ప్రత్యేక అలంకరించి పూజలు చేశారు. అనంతరం భూదేవి, శ్రీదేవి సమేతే స్వామివారి ఉత్సవమూర్తులను అలంకరించి శేషవాహనంపై కొలువుదీర్చి గ్రామపురవీధుల్లో ఊరేగింపు చేశారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు

పామిడి/కణేకల్లు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షాదీఖానాలో ముస్లిం మైనార్టీలకు బుధవారం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు , టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్ ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన ముస్లింలకు స్వయంగా భోజనం వడ్డించారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్ చౌదరి, మున్సిపల్ మాజీ చైర్మన్ గౌస్‌పీరా, ఎంపీటీసీ మాజీ సభ్యులు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే కణేకల్లుమండల కేంద్రంలో టీడీపీ నాయకుడు చంద్రశేఖర్‌గుప్తా ముస్లింలకు ఇఫ్తార్‌విందు ఇచ్చారు. టీడీపీ మండల కన్వీ నర్ లాలెప్ప, చెరువు సంఘం అధ్యక్షుడు బీటీ రమేష్, నాయకులు పాల్గొన్నారు.

నేడు రీసర్వేపై గ్రామసభలు

యాడికి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపాడు, కోనుప్పలపాడు గ్రామాల్లో గురువారం రీసర్వేపై గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ రాజ్‌కుమార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. భూ సమస్యల పరిష్కారం కోసమే రీసర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆయా రెవెన్యూ పంచాయతీల్లోని రైతులు సహకరించాలని కోరారు.

సమస్యలను త్వరగా పరిష్కరించండి

రాయదుర్గం రూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గత మూడురోజుల క్రితం ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన ప్రజాదర్బార్‌లో అనేక మంది ప్రజలు అర్జీల ద్వారా వివిధ సమస్యలు తెలిపారని, వెంటనే పరిష్కరించాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు పసువులేటి నాగరాజు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పొరాళు పురుషోత్తం, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నల్లపూసల వెంకటేశులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం డీటీ సురేష్‌బాబును కోరారు. ముఖ్యంగా రెవెన్యూ సమస్యలు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని తెలిపారు.

ఈకేవైసీ ఉంటేనే రేషన్

పామిడి/యాడికి, మార్చి 19(ఆంధ్రజ్యోతి) :మండలంలోని రేషన్ లబ్ధిదారులకు ఈకేవైసీ ఉంటేనే రేషన్ అందజేస్తామని తహసీల్దార్ శ్రీధరమూర్తి, సీఎస్‌డీటీ కంబక్క తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వారు రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమీక్షించారు. ఈ నెలాఖరులోపు ప్రతి లబ్ధిదారుడికి ఈకేవైసీ తప్పక చేయించాలన్నారు. వీఆర్వోలు, స్టోర్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు సకాలంలో ఈకేవైసీ పూర్తి చేయించాలని ఆదేశించారు. అలాగే యాడికి తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి కూడా రేషన్ లబ్ధిదారులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ప్రకటనలో సూచించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

తాడిపత్రి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని డిగ్రీ కళాశాల వెనుక వైపున బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు రూరల్ సీఐ సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించామన్నారు. మృతుడికి 55సంవత్సరాల వయసు ఉంటుందన్నారు. ఇతను పట్టణంలో యాచక వృత్తి చేసుకుంటూ జీవనం సాగించేవాడన్నారు. వివరాలు తెలియాల్సి ఉందని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

కర్ణాటకకు చెందిన వృద్ధుడు..

రాయదుర్గం రూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని అశోక సిద్ధాపురం గ్రామానికి చెందిన వృద్ధుడు బసవరాజు(60) పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద గల అన్నక్యాంటీన్ వెనుకవైపున బుధవారం మృతి చెందాడు. వృద్ధుడు టీబీ వ్యాధితో బాధపడుతుండేవాడు. మానసిక పరిస్థితి కూడా బాగాలేదు. కుటుంబ సభ్యులకు బళ్లారిలోని ఆసుపత్రికి వైద్యం కోసం వెళుతున్నానని చెప్పి ఇక్కడి వచ్చాడని పోలీసులు తెలిపారు. అయితే పాతబస్టాండ్ వద్ద అన్న క్యాంటీన్ వద్ద మృతి చెందాడన్నారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జయనాయక్ తెలిపారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

పామిడి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పామిడమ్మ ఆలయం వద్ద టీడీపీ నాయకుడు పిక్కిలి రంగనాయకులు ఆపరేషన్ చేయించుకొని విశ్రాంతి తీసుకుంటుండడంతో పార్టీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్ బుధవారం పరామర్శించారు. ఆరోగ్యంపై ఆరాతీశారు. అధైర్యపడొద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పార్టీ నాయకులు ఉన్నారు.

మామిడి తోటల పరిశీలన

బ్రహ్మసముద్రం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాలవెంకటాపురం, సంతేకొండాపురంలో మామిడి పంటలను ఉద్యానవన శాఖ అధికారి కృష్ణతేజ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు సస్యరక్షణ చర్యల గురించి వివరించారు.

పన్ను వసూళ్లను వేగవంతం చేయండి

యాడికి, మార్చి19(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు సూచించారు. మండలకేంద్రంలో బుధవారం పర్యటించిన ఆయన పంచాయతీ కార్యాలయంలోని సమావేశ భవనంలో మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. ల క్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలన్నారు. ఎంపీడీఓ వీరరాజు, ఈఓపీఆర్‌డీ శశికళ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గద్దిరాళ్ల మారెమ్మ రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

గుంతకల్లుటౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి):పట్టణంలో కథల గేరిలో బుధవారం గద్దిరాళ్ల మారెమ్మ అమ్మవారి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్థానిక ఆలయంలో ఉదయమే అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని రథంలోకొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి రథాన్ని లాగారు. టీడీపీ ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణస్వామి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అలాగే రథోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, నాయకులు ఆమ్లెట్‌మస్తాన్‌యాదవ్, తలారిమస్తానప్ప, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ ఆర్ శ్రీనాథ్‌గౌడ్, కౌన్సిలర్ పవన్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దమ్మ జాతర


ప్రత్యేకాలంకరణలో పెద్దమ్మ

బెళుగుప్ప, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాలువపల్లిలో పెద్దమ్మ అమ్మవారి జాతరను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత మంగళవారం రాత్రి 12 గంటలకు నిర్వాహకులు గండ దీపోత్సవ పూజలు చేశారు. తర్వాత బుధవారం స్థానిక ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. గ్రామస్థులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. సర్పంచ్ పెద్దన్న, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

గుత్తి, మార్చి 19(ఆంధ్రజ్యోతి):బాల్య వివాహాలు అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు న్యాయాధికారి శ్వేత సూచించారు. పట్టణంలోని కేజీబీవీలో బుధవారం బాల్య వివాహాలపై విద్యార్థినులకు అవగాహన సదుస్సు నిర్వహించారు. ఇందులో న్యాయాధికారి పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో తల్లిదండ్రులు బాలికలను బాగా చదివించాలని తెలిపారు. బాల్యవివాహాలు చేసి వారి జీవితాలను నాశనం చేయొద్దని చెప్పారు. ఎవరైనా బాల్యవివాహాలు చేసినా, ప్రోత్సహించినా శిక్షకు అర్హులవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఓ రుద్రాక్ష, ప్యానల్ అడ్వకేట్ గంగాధర్, సోషల్ వర్కర్ బాలాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని వినతి

రాయదుర్గం రూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని జుంజురంపల్లిలో షాదీమహల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఆ గ్రామానికి చెందిన మైనార్టీ పెద్దలు మహమ్మద్ పీరా, నబీరసూల్, జాఫర్ కోరారు. ఈ మేరకు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం డీటీ సురేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జుంజురంపల్లిలో 62 ముస్లిం మైనార్టీ కుటుంబాలు ఉన్నాయని, శుభకార్యాలు జరుపుకునేందుకు షాదీమహల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో మైనార్టీలు పలువురు పాల్గొన్నారు.

భూ రీసర్వేపై అవగాహన ర్యాలీలు

బొమ్మనహాళ్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు, హరేసముద్రం గ్రామాల్లో బుధవారం రెవెన్యూ అధికారులు భూ రీసర్వేపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మునివేలు , సిబ్బంది గ్రామాల రైతులతో కలిసి పురవీధుల్లో ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూ రీసర్వేతో ఎన్నో దశాబ్దాల నుంచి ఉన్న భూసమస్యలు పరిష్కారమవుతాయని, రైతుల దగ్గరుండి తమ భూములను సర్వే చేయించుకోవాలని సూచించారు. సర్వేయర్ రవితేజ, వీఆర్వోలు పాల్గొన్నారు.

బందార్లపల్లిలో చోరీ

తాడిపత్రి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని బందార్లపల్లి గ్రామంలో బుధవారం పట్టపగలు చోరీ జరిగినట్లు ఎస్‌ఐ కాటయ్య తెలిపారు. గత మంగళవారం ఆటోబోల్తా పడిన సంఘటనలో రసూల్‌బీ మృతి చెందడంతో బందార్లపల్లిలోని ఆమె కుమార్తె అలిమా, భర్త అనిఫ్‌తో కలిసి అనంతపురానికి వెళ్లింది. ఇంటిలో ఎవరూ లేనిది చూసి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న వారు బుధవారం స్వగ్రామానికి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంగారు నెక్లెస్, కమ్మలు, గొలుసుతోపాటు కొంత డబ్బును చోరీ చేశారని చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రాయదుర్గంరూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 74 ఉడేగోళం గ్రామ సమీపంలో భావనస్కూల్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఉడేగోళం నుంచి ఆటోలో డ్రైవర్ వన్నూరుస్వామి, ప్రయాణికుడు వీరభద్రప్ప రాయదుర్గం వైపు వస్తున్నారు. భావన స్కూల్ సమీపంలో ఇటుకల బట్టీ నుంచి రాయదుర్గానికి వెళ్లే మెయిన్‌రోడ్డుకు వస్తుండగా బొలెరో వాహనం ఢీ కొంది. ప్రమాదంలో ఆటోలోని ఇద్దరికీ గాయాలయ్యాయి. స్థానికులు రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

హుండీ లెక్కింపు

తాడిపత్రి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగాదేవిపల్లి గ్రామంలో గల గంగాభవానీ ఆలయంలో బుధవారం హుండీల లెక్కింపు నిర్వహించినట్లు ఆలయ ఈఓ రామాంజనేయులు తెలిపారు. హుండీల్లో భక్తులు వేసిన కానుకల ద్వారా ద్వారా రూ.2,25,906 ఆదాయం వచ్చినట్లు చెప్పారు. అదేవిధంగా తలనీలాల వేలంపాట ద్వారా రూ.1,35000 ఆదాయం వచ్చిందన్నారు. అధికారులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి

ఉరవకొండ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని నింబగల్లు గ్రామంలో టీడీపీ కార్యకర్త బీ. తిమ్మరాజు గుండెపోటుతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. విషయం తెలుసుకున్న పార్టీ నాయకులు రేగాటి నాగరాజు, మోపిడి గోవిందు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.